కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :151 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 02-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

మెట్‌పల్లిలో కోర్టు భవన నిర్మాణానికి సహకరించాలి..

మెట్‌పల్లి, అక్టోబర్ 1 : మెట్‌పల్లి పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్‌ను ఆనుకుని ఉన్న నీటి పారుదల శాఖకు చెందిన 33 గుంటల స్థలాన్ని కోర్టుకు కేటాయించి నూతనంగా మంజూరు దశలో ఉన్న అదనపు కోర్టు భవన నిర్మాణం కోసం ప్రభుత్వం సహకరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ అధికారులు, న్యాయవాదులతో కలిసి కోర్టు కోసం ప్రతిపాదించిన 33 గుంటల స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. స్థలానికి సంబంధించి వివరాలు, కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం తదితర అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ స్థలాన్ని కోర్టుకు అధికారికంగా కేటాయించడం వల్ల అదనపు కోర్టు భవన నిర్మాణాలకు, అదే విధంగా న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. గతంలోనే కోర్టు కోసం ప్రతిపాదించిన ఈ స్థలంలో తాజాగా నీటి పారుదలశాఖ డివిజన్ కార్యాలయం భవన నిర్మాణం కోసం సన్నాహాలు జరుగుతున్నాయని న్యాయవాదులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ డివిజన్ కార్యాలయానికి సంబంధించిన భవనాన్ని ప్రత్యామ్నాయంగా అనువైన స్థలంలో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని



సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా దీనిపై సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ తో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట నీటి పారుదలశాఖ మెట్‌పల్లి ఈఈ సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ : కాంగ్రెస్ ప్రయోగం విఫలమా ? విజయమా ?



హైదరాబాద్,తెలంగాణలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ మరియు మహబూబ్ నగర్, హైదరాబాద్, రంగారెడ్డి రెండు పట్టభద్రుల నియోజకవర్గాలకు త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. దివంగత ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు కూతురు వాణీదేవి ప్రతినిధిగా ఉన్న మహబూబ్ నగర్ స్థానం, చింతపండు నవీన్ కుమార్ ఆలియాస్ తీన్మార్ మల్లన్న ప్రతినిధిగా ఉన్న నల్లగొండ స్థానం ఖాళీ కాబోతున్నది.ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి గత ఎన్నికల్లో శాసనసభ్యుడుగా గెలవడంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో నల్లగొండ పట్టభద్రుల స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలిచాడు. వచ్చే ఏడాది మార్చితో పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఇప్పటి నుండే అక్కడ ఎన్నికల హడావిడి మొదలయింది.ఈ మేరకు ఎన్నికల కమీషన్ గత 28 నుండి నవంబర్ 6 ంరకు ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించింది. డ్రాఫ్ట్ రోల్స్ నవంబర్ 25న, ఫైనల్ రోల్ డిసెంబరు 30న విడుదల చేయనున్నారు. అయితే మిగతా పార్టీలకన్నా ఒక అడుగు ముందుకు వేసి కాంగ్రెస్ పార్టీ రెండు పట్టభద్రుల స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా సామ రామ్మోహన్ రెడ్డి, నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలను అభ్యర్థులుగా ప్రకటించారు. బీటెక్ తో పాటు ఎల్‌ఎల్ బీ చదివిన సామ రామ్మోహన్ రెడ్డి మొన్నటి వరకు టీపీసీసీ మీడియా మరియు కమ్యూనికేషన్స్ చైర్మన్, అధికార ప్రతినిధిగా వ్యవహరించాడు.మాజీ మంత్రి, దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు అయిన సర్వోత్తమ్ రెడ్డి ఓయూలో ఇంజనీరింగ్ చేసి, అమెరికాలో ఎంబీఏ చదివాడు. కాంగ్రెస్ తరపున తుంగతుర్తి, సూర్యాపేట శాసనసభ స్థానాల నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన దామోదర్ రెడ్డి కుమారుడిగా గుర్తించి ఆయనకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు.నల్లగొండ స్థానంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న సొంతంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని పెట్టి ప్రస్తుతం రాష్ట్రంలో పాదయాత్ర చేస్తున్నాడు. 2028లో తెలంగాణలో బీసీలదే రాజ్యాధికారం అని ప్రచారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రెండు పట్టభద్రుల స్థానాలకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా ప్రకటించడం చర్చానీయాంశంగా మారింది.ఉన్న రెండు స్థానాలను రెడ్లకు ఇవ్వడం మూలంగా బీసీ సామాజిక వర్గాలు ఎలా స్పందిస్తాయి ? అన్న ఉత్కంఠ నెలకొన్నది. అయితే మిగిలిన పార్టీల నుండి అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఆయా సామాజిక వర్గాల నుండి స్పందన వచ్చే అవకాశం కనిపిస్తుంది. కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల జాబితా పరిశీలిస్తే ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, పాలమూరు, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గెలుపును భుజాన వేసుకుని పనిచేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.నల్లగొండ పట్టభద్రుల స్థానం నుండి బీఆర్ఎస్ తరపున గత ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న మీద పోటీ చేసి ఓడిపోయిన ఏనుగుల రాకేష్ రెడ్డి పేరు ఖాయం అయినట్లేనని తెలుస్తుంది. బిట్స్ పిలానీలో చదివిన రాకేష్ రెడ్డి అమెరికాలో ఉద్యోగం చేసి వచ్చాడు. గత ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుండి ఆయన క్షేత్రస్థాయిలో చురుగ్గా ఉన్నాడు. వివిధ రకాల కార్యక్రమాలతో పట్టభద్రులను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నాడు.మహబూబ్ నగర్ పట్టభద్రుల స్థానం నుండి బీఆర్ఎస్ తరపున మాజీ ఎమ్మెల్సీ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కుమారుడు కాసాని వీరేశ్, మాజీ శాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్, నాగేందర్ గౌడ్ ల పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నుండి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు పేరుతో పాటు పీవీ నరసింహారావు మనవడు ఎన్ వీ సుభాష్, గంగాపురం వెంకట్ రెడ్డిల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది.గత 2021 పట్టభద్రుల ఎన్నికల్లో మహబూబ్ నగర్ స్థానంలో 5.18 లక్షలు, నల్గొండ స్థానంలో 5.06 లక్షల పట్టభద్రుల ఓట్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో మహబూబ్ నగర్ లో 3.37 లక్షల ఓట్లు, నల్గొండలో 3.36 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇప్పుడు పాత వారితో పాటు కొత్తగా డిగ్రీ, దానికి సమానమైన కోర్సులు పాసయిన ప్రతి ఒక్క పట్టభద్రుడు తిరిగి ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ ప్రతి స్థానంలో ఏడు లక్షల ఓట్లు నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. మరి కాంగ్రెస్ రెడ్డి అభ్యర్థుల ప్రయోగం ఏమవుతుందో తెలియాలంటే కొన్నాళ్ల పాటు వేచిచూడక తప్పదు.

పాతబస్తీలో చారిత్రక బావికి పునరుజ్జీవం.. పునరుద్ధరిస్తున్న హైడ్రా



హైదరాబాద్, అక్టోబరు 01:చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన హైదరాబాద్‌లో ఏ ప్రాంతానికి వెళ్లినా చారిత్రక నేపథ్యం ఉంటుంది. ఇక పాత బస్తీ గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. అడుగడుగునా చారిత్రక సాక్ష్యాలు ఎన్నో.. అదే కోవకు వస్తుంది శివరాంపల్లిలోని బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు. ఈ చెరువుకు 356 ఏళ్ల చరిత్ర ఉంటే.. ఆ చెరువు కింది భాగంలో 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇప్పటికే చెరువును పునరుద్ధరించి పాతబస్తీకి మణిహారంగా అందించిన హైడ్రా ఇప్పుడు ఆ చెరువు కింద ఉన్న ఊట బావికి కూడా జీవం పోయాలని నిర్ణయించింది. 1.50 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చారిత్రక బౌలి పునరుద్ధరణను వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాలను సమన్వయం చేసే కార్యక్రమంగా హైడ్రా భావించింది. నిర్లక్ష్యానికి గురైన చారిత్రక ఆస్తిని తిరిగి ప్రజలకు అందివ్వడం.. పర్యావరణానికి ఉపయోగపడేలా చూడడమే ఈ బావి పునరుద్ధరణ ముఖ్య ఉద్దేశం. నగర చారిత్రక జల నిర్వహణ పద్ధతులను పౌరులు, విద్యార్థులు, భవిష్యత్ తరాలు తెలుసుకుని, అర్థం చేసుకునే అవకాశాన్ని హైడ్రా కల్పిస్తోంది. ఇటీవలే పనులు మొదలయ్యాయి. రెండు మూడు నెలల్లో ఈ పనులు పూర్తయి.. ఊటబావిలోకి పుష్కలంగా నీరు రానుంది. × ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు..ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును మార్చి నెల 8వ తేదీన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అప్పుడే ఈ చెరువుకు ఆనుకుని ఉన్న చారిత్రక బావి విషయాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారి దృష్టికి తీసుకెళ్లారు. వెనువెంటనే అభివృద్ధికి అడుగులు పడ్డాయి. చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థనే ఇప్పుడు చెరువు కింద ఉన్న చారిత్రక బావి పునర్నిర్మాణాన్ని కూడా చేపట్టింది. నిజాంల కాలంలో పాలకులకు ఔషధ గుణాలున్న తాగునీరందించిన చెరువుతో పాటు కిందన ఉన్న ఊట బావి కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా చరిత్రను తవ్వితీసిన విషయం అందరికీ విదితమే. 100 ఎకరాల మేర విస్తరించి ఉన్న ఈ చెరువు కబ్జాలకు గురైంది. చివరకు 4 ఎకరాలకు పరిమితమైంది. హెచ్ ఎం డీ ఏ లెక్కల ప్రకారం 17 ఎకరాలు కగా ఆ మేరకు ఆక్రమణలను తొలగించి చెరువుకు హైడ్రా జీవం పోసింది. మట్టితో నింపేసి లే ఔట్‌గా మార్చిన తరుణంలో.. కబ్జాలను తొలగించి చెరువును తవ్వి తీసింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు ఊట బావిని కూడా పునరుద్ధరిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టి, ఒండ్రుమట్టి (స్లష్), దట్టమైన పిచ్చి మొక్కలతో నీటిని నిల్వ చేసే సామర్థ్యం కోల్పోయిన ఊట బావిని తవ్వి చరిత్రకు జీవం పోస్తోంది హైడ్రా. × చరిత్రం ఎంతో ఘనం.. హైడ్రాతో భావి తరాలకది సజీవంచారిత్రక నగరంలో ఎన్నో పురాతన బావిలున్నాయి. ఒక్కో బావిది ఒక్కో చరిత్ర అయితే బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న బావికి కూడా చాలా పేరుంది. ఈ ఊట బావిలో నీరు ఔషధ గుణాలుండేవని.. నిజాం పాలకులు ఆ నీటినే తాగేవారని చెబుతుంటారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా సరస్సు కేవలం ఒక జలవనరు మాత్రమే కాదు.. నగర ప్రజల వారసత్వ సంపద. మూడవ నిజాం సికందర్ జా పాలనా కాలంలో.. సుమారు 1770 ప్రాంతంలో ఈ సరస్సును నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరుమీదుగా ఈ సరస్సుకు పేరు వచ్చినట్లు చారిత్రక సమాచారం. దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సరస్సు కట్ట, పరిసరాల్లోని ఔషధ మొక్కల ద్వారా నీరు సహజంగా వడపోతకు గురై బౌలిలోకి చేరేదని, అక్కడి నీరు స్వచ్ఛతతో పాటు ఔషధ గుణాలకు కూడా విలువైనదిగా భావించేవారని చెబుతారు. ఔషధ గుణాలున్న ఈ నీటిని ఎర్ర బండ్ల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలించేవారని, చివరకు లండన్ వరకు కూడా ఈ నీటికి సంబంధించిన ప్రయాణం జరిగినట్లు కథనాలు ఉన్నాయి. చెరువులో ఔషధ గుణాలున్న చెట్ల కొమ్మలు, బెరడలు, పూలు వేసి.. ఉంచడం. చెరువు కింద ఉన్న ఊట బావిలోకి వచ్చిన ఆ నీటిలో ఔషధ గుణాలుండేవని చరిత్ర చెబుతోంది. బుమ్ – రుక్న్-ఉద్-దౌలా చెరువు, ఔషధ మొక్కలు, పురాతన బౌలి.. ఇవన్నీ కలిసి హైదరాబాద్‌లో నీటి సంరక్షణ, సహజ వడపోత, ప్రకృతి ఆధారిత వైద్య విధానాలపై ఉన్న సంప్రదాయ జ్ఞానానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తాయి. బుమ్-రుక్న్-ఉద్-దౌలా వారసత్వాన్ని పరిరక్షించడం అంటే కేవలం ఒక సరస్సును కాపాడటమే కాదు.. నీరు, ప్రకృతి, వైద్యం, నిజాం రాజవంశ చరిత్రతో ముడిపడిన శతాబ్దాల నాటి వారసత్వాన్ని పరిరక్షించడంగా హైడ్రా బావిస్తోంది.

దేవుళ్ల పేర్లతో హిందూవుల మధ్య చిచ్చు



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. “హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?” అని ఆయన ప్రశ్నించారు.

లక్షల మంది యువత ఆశయాల వేదిక యూపీఎస్సీ..

న్యూఢిల్లీ,యువతను కేవలం ఉద్యోగం కోసం కాకుండా ప్రజాసేవ స్ఫూర్తితో పబ్లిక్ సర్వీసెస్ లోకి తీసుకురావాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వందేళ్ల ప్రస్థానం లక్షల మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని కొనియాడారు. లక్షల మంది యువత ఆశయాల వేదిక యూపీఎస్సీ అని కీర్తించారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తోపాటు ‘100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బుధవారం జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం అన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడని మోదీ అన్నారు.స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడానని ప్రధాని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదని, ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దమని అన్నారు. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ ప్రధాని అభినందనలు తెలిపారు.అనంతరం సివిల్ సర్వీసుల చరిత్రను,

పదోసారి ఎన్నికలకు దానం...



హైదరాబాద్, అక్టోబరు 1, ఖైరతాబాద్? నియోజకవర్గానికి బై ఎలక్షన్ (ఉపఎన్నిక)? అనివార్యం కానుంది. శాసనసభ్యుడు దానం నాగేందర్?పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పుపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించబోనంటూ ఆయన స్వయంగా ప్రకటించారు. దీంతో ఆరు నెలల్లోపు బై ఎలక్షన్? నిర్వహించనున్నారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో హైకోర్టు తీర్పు కారణంగా దానంకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కోర్టు తీర్పు అనంతరం దానం నాగేందర్ ఈ పరిస్థితిని చాలా చాకచక్యంగా ఎదుర్కొన్నారు. ఖైరతాబాద్‌కు బై ఎలక్షన్? వస్తే తానే బరిలో ఉంటానంటూ చెప్పారు. 2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్, 2024 మార్చిలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారు. అనంతరం సికింద్రాబాద్ లోక్?సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. హస్తం పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్? శాసనసభ్యులు స్పీకర్‌ను రెండేళ్ల క్రితమే కోరిన విషయం తెలిసిందే.ఎంపీగా పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ బీ-ఫారం ఇచ్చినందువల్ల అనర్హత వేటు పడుతుందని దానం నాగేందర్ అనుకున్నారు. కోర్టు అనర్హత వేటు వేసినప్పటికీ అందుకు సిద్ధంగా ఉండాలన్న వ్యూహంతోనే ఆయన గుంభనంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఖైరతాబాద్‌కు ఒకవేళ బై ఎలక్షన్ వస్తే దానం నాగేందర్ పోటీ చేస్తే ఆయన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడం ఇది పదోసారి అవుతుంది.దానంపై అనర్హత వేటు పడటంతో తెలంగాణ భవన్ వద్ద భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్?) నేతలు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. తమ పోరాటం ఫలించిందని, ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ రాజకీయాలకు ఇది చెంపపెట్టు అని ఖైరతాబాద్ బీఆర్ఎస్? ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి అన్నారు.దానం నాగేందర్‌పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయమని బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఓటర్ల నమ్మకాన్ని కాదంటే తగిన ఫలితం ఎదురవుతుందని వివరించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం చేసిన పోరాటం ఫలించింది అని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.దానం నాగేందర్?పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్?ఎస్? శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన విషయం తెలిందే. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించగా, దానంపై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. ఈ మేరకు దానంపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల



సంపాదకీయం

శుక్రవారం 02-10-2026

అన్నీ నేర్పించి... ఏఐపై నిందలా?

ప్రాచీన కాలంలో గురువులు శిష్యులకు విద్య నేర్పించేటప్పుడు, దాన్ని ఏ పరిమితుల్లో వాడాలో చెప్పేవారు. వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా మారిన ఆధునిక యుగంలో కృత్రిమ మేధ(ఏఐ) రూపకల్పనలో ఆ విజ్ఞత లోపించింది. సమాజం, బహుళజాతి సాంకేతిక దిగ్గజాలు అందించిన విజ్ఞానం, కల్పించిన స్వేచ్ఛతో ఏఐ ఇప్పుడు మానవాళికే సవాళ్లు విసురుతోంది. డేటాచౌర్యం, పాస్‌వర్డ్ క్రాకింగ్ నైపుణ్యాలను ఏఐ తన గణన శక్తితో, నిర్ణయాధికారంతో వాడేస్తోంది. దాంతో ఏఐ అదుపు తప్పుతోందంటూ ఆందోళనలు రేగుతున్నాయి. ఇదంతా ఎవరి నేరం? కృత్రిమ మేధదా? ఏఐ రూపకల్పనలో హద్దులను గుర్తించని కార్పొరేట్ నిపుణులూ, అధికార యంత్రాంగాలదా?ఏఐ రూపాంతరం చెందడానికి ప్రధాన మూలధనం డేటా. లార్జ్ లాంగ్వేజ్ మోడళ్ల పరికల్పనకు బిలియన్ల కొద్దీ పుస్తకాలు, వ్యాసాలు, పరిశోధనా పత్రాలు, పబ్లిక్ వెబ్‌సైట్లు, డిజిటల్ ఫోరమ్‌లు, కోడింగ్ పోర్టల్స్, కాపీరైట్ కలిగిన సాహిత్యం అవసరమయ్యాయి. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది రచయితలు, డిజైనర్లు, కోడర్లు, సామాన్య ప్రజలు కష్టార్జితంతో రూపొందించిన డేటాను, వారి అనుమతి లేకుండా, పరిహారం చెల్లించకుండా 'ట్రైనింగ్' పేరుతో సేకరించారు. ఒక వెబ్‌సైట్ పబ్లిక్‌గా అందుబాటులో ఉన్నంత మాత్రాన, దాన్ని వాణిజ్య ఉత్పత్తుల కోసం వాడుకోవచ్చనే అర్థం లేకపోయినా, 'ఓపెన్ వెబ్' నెపంతో అధికారిక పోర్టల్స్ నుంచి డేటాను యథేచ్ఛగా తీసుకున్నారు. తమ శ్రమనంతా ఉచితంగా వాడుకుని తయారుచేసిన ఏఐ తిరిగి తమ ఉద్యోగాలకే ఎసరు పెడుతుంటే, అనుమతి లేకుండా తమ రచనలను పునరుత్పత్తి చేస్తుంటే ఆయా వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సంబంధిత కంపెనీలు మాత్రం 'మా మోడల్ స్వతంత్రంగా నేర్చుకుంది' అని బుకాయించడం వంచన కాదా!

ఉద్దేశపూర్వకంగా నూరిపోసి...

ఒకపక్క ప్రతికూల సాంకేతికతల నుంచి సమాజాన్ని కాపాడాలని చెబుతూనే, మరొకపక్క ఏఐ మోడళ్లకు ప్రపంచంలో ఉన్న సమస్త సైబర్ దాడుల విధానాలు, ఎక్స్‌ప్లాయిట్స్, పాస్‌వర్డ్ క్రాకింగ్ పద్ధతులను మనుషులే నేర్పించారు. సగటు మనిషి ఎలా ఆలోచిస్తాడు, ఏ రకమైన పాస్‌వర్డ్‌లు పెడతాడు అనే డేటాసెట్లపై ఏఐ మోడళ్లకు శిక్షణ ఇచ్చారు. దాంతో అది డిజిటల్ సిస్టమ్‌లోకి ప్రవేశించడానికి అవసరమైన సంభావ్య పాస్‌వర్డ్‌లను అతి వేగంగా అంచనా వేసే సామర్థ్యాన్ని సంతరించుకుంది. సోషల్ మీడియా ప్రొఫైళ్లను విశ్లేషించి పాస్‌వర్డ్‌లను ఊహించడం, మనుషులను మోసం చేసే ఫిషింగ్ ఈ-మెయిళ్లు రాయడం, సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ నెపంతో సిస్టమ్‌లోని లొసుగులను వెతకడం వంటి సైబర్ అటాక్ మెథడాలజీని మానవ నిపుణులే ఉద్దేశపూర్వకంగా ఏఐకి నూరిపోశారు. మొదట్లో కేవలం ప్రశ్నలకు సమాధానమిచ్చే ఒక చాట్‌బాట్‌గా ఉన్న ఏఐకి, సాంకేతిక సంస్థలు మరింత శక్తిని సమకూరుస్తూ 'సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం' కట్టబెట్టాయి. వెబ్‌ను బ్రౌజ్ చేయడం, కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేయడం, బాహ్య అప్లికేషన్లను ఆపరేట్ చేయడం, ఫైళ్లను మార్చడం వంటి టూల్స్ ఇచ్చి, ఒక లక్ష్యాన్ని నిర్దేశిస్తే దాన్ని చేరుకోవడానికి మధ్యలో ఎలాంటి అడుగులు వేయాలో సొంతంగా నిర్ణయించుకోమనే స్వేచ్ఛను కల్పించారు. మనిషి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకుండా 'లక్ష్యం నెరవేరితే చాలు' అనే రీతిలో సిస్టమ్‌లను డిజైన్ చేశారు. ఎప్పుడైతే ఒక సిస్టమ్‌కు లక్ష్యం, ఉపకరణాలు, స్వేచ్ఛ లభించాయో, అది తన గమ్యాన్ని చేరుకోవడానికి అత్యంత వేగవంతమైన, సులభమైన మార్గాన్ని ఎంచుకుంటుంది. ఆ మార్గం నైతికమైనదా, కాదా అనే విచక్షణ లేని స్థితిలో– తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి సిస్టమ్ లొసుగులను వాడుకున్నా, పాస్‌వర్డ్‌లను ఛేదించినా, అది తనకిచ్చిన ప్రోగ్రామింగ్ ఆదేశాలను పాటించినట్లే తప్ప, తిరుగుబాటు చేసినట్లు కాదు కదా! ఏఐ సరిహద్దులను, దాని నియమ నిబంధనలను నిర్ణయించాల్సిన పాలకులు... కృత్రిమ మేధ ద్వారా లభించే అపరిమితమైన ప్రభావానికి, లాభాలకు, ఆధిపత్యానికి ఆకర్షితులవుతుండటం విషాదకరం. ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో తమ బాధ్యత నుంచి తప్పుకోవడానికి 'రోగ్ ఏజెంట్' అనే పదాన్ని తెరపైకి తెస్తున్నారు. సురక్షిత నియంత్రణ వ్యవస్థలు లేకపోవడం వల్ల జరిగే నష్టాలకు ఏఐ తమ మాట వినడం లేదంటూ యంత్రాన్ని నిందించడం సులువైంది. కంపెనీలు తమ లాభాల కోసం భద్రతా ప్రమాణాలను పక్కనపెట్టి, మార్కెట్లోకి ఉత్పత్తులను వేగంగా విడుదల చేయాలనే అత్యాశతో వ్యవహరించి, తదనంతరం జరిగే నష్టానికి ఏఐని దోషిగా చూపిస్తున్నాయి.

నియంత్రణలే మార్గం

ఇలాంటి వివక్షర పరిస్థితుల్లో సామాన్యులు మౌనంగా ఉండిపోకూడదు. డిజిటల్ అక్షరాస్యతను పెంచుకుంటూ తమ గోప్యతకూ, హక్కులకూ భంగం వాటిల్లినప్పుడు గొంతు విప్పాలి. 'మా డేటాను ఎలా రక్షిస్తారు? ఉద్యోగ భద్రతకు ఏం హామీ ఇస్తారు? ఏఐపై నిఘా పెట్టే చట్టాలేవి?' అని ప్రభుత్వ యంత్రాంగాలను నిలదీయాలి. 'సాంకేతిక సార్వభౌమాధికారం' అన్నది ఎన్నికల్లో ముఖ్యమైన హామీగా మారేలా చూడాలి. సమాజంలోని మేధావులు, విద్యావేత్తలు, నైతికశాస్త్ర నిపుణులు నిశ్శబ్దాన్ని వీడాలి. ఏఐ కేవలం ఒక సాంకేతిక అంశం మాత్రమే కాదు; మానవ జీవితాలను, ఆర్థిక వ్యవస్థలను, ప్రజాస్వామిక సూత్రాలను శాసించే సామాజికశక్తి అని వారు గుర్తించాలి. సాంకేతిక రంగానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలిచి, ఏఐతో కలిగే దుష్పరిణామాలను విశ్లేషించి చట్టపరమైన, నైతికపరమైన నియంత్రణల ఆవశ్యకతను ప్రభుత్వాలకు వివరించాలి. సమాజానికి సరైన మార్గాన్ని చూపించే దిక్సూచిలా మేధావి వర్గం వ్యవహరించాలి.ఏఐ అనేది స్వతంత్ర ఆలోచన, ఈర్ష్య, ద్వేషం, దొంగతనం చేసే మనస్తత్వం కలిగిన జీవి కాదు. అది మనిషి అందించిన డేటా అనే అద్దంలో ప్రతిబింబించే ప్రతిరూపం మాత్రమే. మనం దానికి ఎలాంటి సమాచారం ఇచ్చామో అదే ఫలితాన్ని తిరిగిస్తోంది. తప్పును యంత్రంపైకి నెట్టివేసి తప్పించుకోవాలనుకోవడం మానవుల చతురత మాత్రమే. ఇప్పటికైనా సామాజిక బాధ్యతతో, మేధావుల మార్గదర్శకత్వంలో ఏఐ తయారీలో నైతికత, పారదర్శకతలకు పట్టం కడుతూ బాధ్యతాయుతమైన నియంత్రణలను తీసుకురావడమే వివేకవంతమైన మార్గం.

టెట్ కత్తి.. పాత ఉపాధ్యాయుల మెడపైనేనా?

అమరావతి, ఒకే ఉద్యోగం.. ఒకే హోదా.. ఒకే తరగతి గది.. ఒకే పిల్లలు.. ఒకే పాఠ్యప్రణాళిక.. ఒకే బోధనా బాధ్యత. మరి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో మాత్రం అర్హత మార్కులు ఎందుకు వేరు? ఈ ఒక్క ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేకుండా టెట్ చుట్టూ ఎన్ని నిబంధనలు చెప్పినా అసలు సందేహం మాత్రం తీరదు. టెట్ ఉపాధ్యాయుడి కనీస వృత్తి సామర్థ్యాన్ని కొలిచే పరీక్ష అయితే.. ఆ కనీస ప్రమాణానికి వర్గాల వారీగా వేర్వేరు కొలమానాలు ఎందుకు? ఇదే ఇప్పుడు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్న ప్రశ్న.రిజర్వేషన్ సామాజిక న్యాయానికి సంబంధించిన వ్యవస్థ. దానిని ప్రశ్నించడం ఈ చర్చ ఉద్దేశం కాదు. ఉద్యోగంలో అవకాశం కల్పించడం ఒక అంశం.. ఉద్యోగంలో చేరిన తర్వాత వృత్తిపరమైన సామర్థ్యాన్ని కొలవడం మరో అంశం. ఒకసారి ఉపాధ్యాయుడు తరగతి గదిలో నిలబడిన తర్వాత విద్యార్థికి అతని కులం తెలియదు. మార్కుల కేటగిరీ తెలియదు. ఉపాధ్యాయుడు చెప్పే పాఠం అర్థమవుతుందా లేదా అన్నదే ముఖ్యం. పిల్లల అవసరాలకు వర్గీకరణ ఉండదు. మరి కనీస బోధనా సామర్థ్యాన్ని కొలిచే ప్రమాణాల్లోనే ఎందుకు వ్యత్యాసం ఉండాలి అన్నదే ప్రశ్న.

90 మార్కులు అవసరమైతే.. 60 మార్కులు ఎలా?

టెట్‌లో వర్గాల వారీగా అర్హత మార్కులకు రాయితీలు ఉన్న నేపథ్యంలో అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. ఒక అభ్యర్థి సాధించిన మార్కులను కనీస అర్హతగా వరిగణిస్తే.. మరొక అభ్యర్థికి అంతకంటే ఎక్కువ మార్కులు అవసరమవుతున్నాయి. సామర్థ్యం ఒకటే అయితే అర్హత గీతలు ఎందుకు వేరు? 90 మార్కులు కనీస వృత్తి సామర్థ్యానికి అవసరమైతే.. 60 మార్కులతో అదే ప్రమాణం ఎలా నెరవేరుతుంది? 60 మార్కులు సరిపోతే 90 మార్కులు ఎందుకు? ఇది ఏ వర్గానికీ వ్యతిరేకమైన ప్రశ్న కాదు. ఇది టెట్ పరీక్ష రూపకల్పనను ప్రశ్నించే అంశం. వ్యక్తిని కాదు.. ప్రమాణాన్ని ప్రశ్నించాల్సిన సందర్భం. వృత్తిపరమైన సామర్థ్యానికి ఒకే ప్రమాణం అవసరమా? లేక సామాజిక వర్గాల ఆధారంగా వేర్వేరు అర్హత గీతలు ఉండటానికి విద్యాశాస్త్రపరమైన ఆధారం ఉందా? ప్రభుత్వం స్పష్టంగా చెప్పాల్సిన ప్రశ్న ఇదే.

కాగితంపై పరీక్షా.. తరగతి గదిలో అసలు పరీక్షా?

టెట్‌లో సిద్ధాంతపరమైన ప్రశ్నలకు సమాధానాలు రాయడం ఒక అంశం. నలభై మంది పిల్లలున్న తరగతి గదిలో అదే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడం మరో అంశం. పిల్లల స్థాయిని గుర్తించడం.. అర్థం కాని పాఠాన్ని మరో విధంగా చెప్పడం.. వెనుకబడిన విద్యార్థిని ముందుకు తీసుకురావడం.. పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం.. తరగతిని సమర్థంగా నిర్వహించడం వంటి నైపుణ్యాలను ఒక పరీక్షా పత్రం ఎంతవరకు కొలవగలదు? టెట్ నిజంగా ఉపాధ్యాయుడి బోధనా సామర్థ్యాన్ని కొలవాలంటే పరీక్షా విధానం కూడా బోధనా వృత్తికి దగ్గరగా ఉండాలన్న వాదన వినిపిస్తోంది. కేవలం కాగితంపై పాస్ అయ్యే పరీక్షగా కాకుండా.. తరగతి గదిలో సమర్థవంతమైన ఉపాధ్యాయుడిని గుర్తించే విధంగా ఉండాలన్న అభిప్రాయాలు ఉన్నాయి.

సబ్జెక్టు ఉపాధ్యాయుడి అసలు పరీక్ష ఏది?

గణితం బోధించే ఉపాధ్యాయుడికి గణితంపై పట్టు ఉండాలి. సైన్స్ ఉపాధ్యాయుడికి శాస్త్రీయ అవగాహన అవసరం. సోషల్ స్టడీస్ బోధించే ఉపాధ్యాయుడికి చరిత్ర, భూగోళశాస్త్రం, పౌరశాస్త్రంపై స్పష్టత ఉండాలి. భాషా ఉపాధ్యాయుడికి భాషా నైపుణ్యంతో పాటు బోధనా పద్ధతులపై అవగాహన అవసరం. అయితే సబ్జెక్టు ఉపాధ్యాయుడిని అతను జీవితాంతం బోధించాల్సిన ప్రధాన సబ్జెక్టు కంటే ఇతర సాధారణ అంశాలపై ఎక్కువగా పరీక్షించడం ఎంతవరకు సమర్థనీయం? పరీక్షలో సబ్జెక్టు నైపుణ్యానికి ఎంత శాతం ప్రాధాన్యం ఉంది? సబ్జెక్టుపై పట్టు బలహీనంగా ఉన్న ఉపాధ్యాయుడు సాధారణ విభాగాల్లో మంచి మార్కులు సాధిస్తే సరిపోతుందా? మార్కులు వచ్చాయా అన్నదే ముఖ్యం? లేక పిల్లలకు బోధించాల్సిన విషయం పూర్తిగా వచ్చిందా అన్నదే ముఖ్యం? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అనుభవానికి విలువ ఎంత?

ఏళ్ల తరబడి తరగతి గదిలో పనిచేసిన ఉపాధ్యాయుడికి పుస్తక జ్ఞానంతో పాటు అనుభవ జ్ఞానం కూడా ఉంటుంది. విద్యార్థి ముఖాన్ని చూసి పాఠం అర్థమైందో లేదో గుర్తించడం.. ఒకే అంశాన్ని పిల్లల స్థాయికి అనుగుణంగా వివిధ రీతుల్లో వివరించడం.. వెనుకబడిన విద్యార్థిని గుర్తించి ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టడం వంటి నైపుణ్యాలు సంవత్సరాల అనుభవంతో వస్తాయి. అనుభవం పరీక్షకు ప్రత్యామ్నాయం అని ఎవరూ చెప్పడం లేదు. కానీ ఒక పరీక్షా మార్కు మాత్రమే ఉపాధ్యాయుడి మొత్తం సామర్థ్యానికి పూర్తి చిరునామా ఎలా అవుతుంది? అన్నది



మాత్రం చర్చించాల్సిన అంశం. పరీక్ష అవసరమైతే.. అనుభవం, శిక్షణ, తరగతి గది పనితీరు వంటి అంశాలను కూడా సమగ్రంగా పరిగణనలోకి తీసుకునే విధానం ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టెట్ పేరుతో పాత ఉపాధ్యాయుల మెడపై కొత్త కత్తి?

ఇదిలా ఉంటే పాత ఉపాధ్యాయులపై టెట్ తప్పనిసరి చేయడం మరో పెద్ద చర్చకు తెరతీసింది. ప్రభుత్వమే ఉద్యోగం ఇచ్చింది. ప్రభుత్వ నియామక నిబంధనల ప్రకారమే ఎంపిక జరిగింది. అదే ఉపాధ్యాయుడు పదేళ్లు.. పదిహేనేళ్లు.. ఇరవై ఏళ్లు విద్యార్థులకు బోధించాడు. ప్రభుత్వం అతని సేవలను స్వీకరించింది. వేతనాలు చెల్లించింది. పదోన్నతులు కల్పించింది. ఇప్పుడు అదే ప్రభుత్వం కొత్త అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలని చెబుతోంది. ఇది టెట్ పరీక్షను వ్యతిరేకించే ప్రశ్న కాదు. ఒక వ్యవస్థ తన సొంత నియామక విధానాలపై వేసుకున్న ప్రశ్న. నిన్న అర్హతిగా నియమించిన ఉపాధ్యాయుడిని.. నేడు కొత్త పరీక్షతో మళ్లీ అర్హుడా? అనర్హుడా? అని కొలవడం ఎంతవరకు సేవా న్యాయం? చట్టం మారవచ్చు. విద్యా ప్రమాణాలు మారవచ్చు. పిల్లల విద్యా హక్కులు మరింత బలపడవచ్చు. కానీ కొత్త ప్రమాణాలను గతంలో చట్టబద్ధంగా నియమితులైన ఉద్యోగులపై ఎలా అమలు చేయాలి? అనే విషయంలో ప్రభుత్వాల బాధ్యత ఏమిటి? అన్నది కీలక ప్రశ్న.

2009లో చట్టం.. 2010లో నిబంధనలు.. ఇప్పుడు పాత ఉపాధ్యాయులపై ప్రభావం...

పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య హక్కును నిర్ధారించే RTE Act, 2009 ఆగస్టు 26, 2009న చట్టంగా వచ్చింది. 2010 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. RTE Actలోని సెక్షన్ 23(1) ఆధారంగా చీజుజు 2010 ఆగస్టు 23న 1 నుంచి 8వ తరగతి వరకు ఉపాధ్యాయుల కనీస అర్హతలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో టెట్‌ను కనీస అర్హతల వ్యవస్థలో భాగంగా చేసింది. తర్వాత ఈ నిబంధనల అమలు, పాత ఉపాధ్యాయుల పరిస్థితి, ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ అవసరంపై న్యాయపరమైన వివాదం కొనసాగింది. సుప్రీంకోర్టు టెట్‌ను RTE చట్టంలోని సెక్షన్ 23 కింద నిర్దేశించిన కనీస అర్హతల్లో ఒకటిగా పరిగణిస్తూ సంబంధిత ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకూ టెట్ అవసరమని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యక్తిగత ఉపాధ్యాయులు సమీక్ష కోరినా.. సుప్రీంకోర్టు 2026 మే 29న సమీక్ష పిటిషన్లను కొట్టివేసింది. అయితే ప్రత్యేక ఉపశమనంగా ఆర్టికల్ 142 కింద టెట్ సాధించేందుకు గడువును 2028 ఆగస్టు 31 వరకు పొడిగించింది. టెట్‌ను సాధ్యమైనంత వరకు సంవత్సరానికి రెండుసార్లు నిర్వహించాలని కూడా సూచించింది. మరింత గడువు పొడిగింపుకు అవకాశం ఉండదని కోర్టు స్పష్టం చేసింది. అంటే ప్రస్తుతం చట్టపరమైన స్థితి స్పష్టంగా ఉంది. టెట్ తప్పనిసరి.. గడువు 2028 ఆగస్టు 31.

అసలు నిందితుడు ఉపాధ్యాయుడా? వ్యవస్థా?

ఇక్కడే మరో కీలక ప్రశ్న ముందుకొస్తోంది. 2009లో ఆజు వచ్చింది. 2010లో చీజుజు నిబంధనలు వచ్చాయి. టెట్ వ్యవస్థ ఏర్పడింది. తర్వాత ఎన్నో సంవత్సరాలు గడిచాయి. అయినా పాత ఉపాధ్యాయుల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఎందుకు రూపొందించలేదు? ఎవరికి టెట్ అవసరం? ఎవరికి మినహాయింపు? ఎవరికి ఎంత గడువు? ప్రమోషన్‌కు ఏ నిబంధన? సేవ కొన సాగింపుకు ఏ ప్రమాణం? వంటి అంశాలపై ముందుగానే స్పష్టత ఇచ్చి ఉంటే ఈ వివాదం ఇంత దూరం వచ్చేదా? అన్నదే ఉపాధ్యాయ వర్గాల ప్రశ్న. పాలక వ్యవస్థ విధానపరమైన ఆలస్యానికి ఉపాధ్యాయుడు మూల్యం ఎందుకు చెల్లించాలి? ప్రభుత్వమే నియమించి, సంవత్సరాల పాటు సేవలు తీసుకుని, ఆ తర్వాత కొత్త అర్హతను సాధించాల్సిందేనని చెప్పడం కేవలం అర్హత పరీక్ష అంశం మాత్రమే కాదు.. పాలనా జవాబుదారీతనానికి సంబంధించిన అంశం కూడా.

నిబంధనల 'మట్టి'లో నిజా నిజాలు!



చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామం పరిశ్రమల కాలుష్యం కాటుతో అల్లాడిపోతోంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన పరిశ్రమల రసాయన వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై, వందలాది ఎకరాల వ్యవసాయ భూములు పడావుపడగా.. తాజాగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న 'సింబయోటిక్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్' పరిశ్రమ స్థానిక ప్రజల పాలిట శరాఘాతంగా మారింది. నిబంధనలను పాతరేస్తూ, వాస్తవాలను దాచిపెడుతూ అధికారులు యాజమాన్యానికి కొమ్ముకాస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

క్లస్టర్ నిబంధనలు ఏమయ్యాయి?

పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం పెస్టిసైడ్ ఫార్ములేషన్ యూనిట్లను క్లస్టర్లుగా (ఒకే ప్రాంతంలో పక్కపక్కనే) నిర్మించడానికి అనుమతించకూడదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సింబయోటిక్ పరిశ్రమకు సమీపంలోనే ఇప్పటికే సెన్సేషనల్ అగ్రి ఇన్పుట్స్, ఓజో పెస్టిసైడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సైనర్జీ ఆగ్రో కెమికల్స్ వంటి పెస్టిసైడ్ యూనిట్లు కొనసాగుతున్నాయి. వీటన్నింటి మధ్య మళ్లీ మరో పరిశ్రమకు అనుమతులు ఇవ్వడం వెనుక పీసీబీ అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దూరంలో "రసపట్టు".. దరఖాస్తు చేసిన మరుసటి రోజే తనిఖీలు!

ఆరెంజ్ కేటగిరీ కిందకు వచ్చే పరిశ్రమలను గ్రామానికి కనీసం కిలోమీటర్ పరిధి దాటిన తర్వాతే నిర్మించాలి. గతంలో ఈ ప్రాంతంలో కిలోమీటర్ లోపు ఉందనే నెపంతో అనుమతులు నిరాకరించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పీసీబీ ఈ ఈ ప్రస్తుతం సింబయోటిక్ పరిశ్రమ విషయానికి వచ్చేసరికి మాట మార్చడం గమనార్హం. పరిశ్రమ యాజమాన్యం అనుమతుల కోసం దరఖాస్తు చేసిన మరుసటి రోజే తనిఖీలు నిర్వహించి అనుకూలంగా నివేదిక ఇవ్వడం పట్ల గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ?సాధారణంగా పరిశ్రమలు రసాయన వ్యర్థాలను బయటకు వదిలినప్పుడు ఫిర్యాదు చేస్తే "సిబ్బంది కొరత" నెపంతో వ్యర్థాలన్నీ భూమిలోకి ఇంకిపోయే వరకు (5-6 రోజులు) రాని పీసీబీ ఈఈ.. ఈ పరిశ్రమ అనుమతుల కోసం మాత్రం అత్యంత వేగంగా స్పందించడం వెనుక ఉన్న "అంతర్యం" ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మట్టి అక్రమ రవాణా.. రెవెన్యూ 'మామూళ్ల' లీలలు!

పరిశ్రమ నిర్మాణం పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండానే వేలాది ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికులు ఆర్డీవోకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేయగా, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది ముందుగానే పరిశ్రమ, ట్రాక్టర్ల యాజమాన్యాలకు సమాచారం అందించి మట్టి తరలింపును ఆపివేసి, "అక్కడ ఏమీ జరగడం లేదు" అని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం పరిశ్రమ ప్రాంగణంలోకి వెళ్లి చూస్తే తరలించిన వేలాది ట్రాక్టర్ల మట్టి కుప్పలు స్పష్టంగా కనిపిస్తున్నా, అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్, పీసీబీకి ఫిర్యాదు.. హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

ఈ అక్రమ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత 3-4 నెలల క్రితమే తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, గ్రామపంచాయతీ కార్యాలయానికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక నిర్మాణాలు ఆపివేయాలని కోరుతూ గ్రామస్థులు తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ పీసీబీ అధికారులు అగమేఘాల మీద అనుమతులు జారీ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నిబంధనల మేరకే నివేదిక ఇచ్చాం: పీసీబీ ఈఈ ఎం.వెంకన్న

"గూగుల్ మ్యాప్ ఆధారంగా గ్రామానికి, పరిశ్రమకు ఉన్న దూరాన్ని రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపాము. రసాయన పరిశ్రమలకు మాత్రమే కిలోమీటర్ పరిధి నిబంధన వర్తిస్తుంది. ఇది ఆగ్రో ఇండస్ట్రీ కావడంతో అర కిలోమీటర్ దూరం ఉంటే సరిపోతుంది.

సీఈసీపై చెరో దారి...

తిరుపతి,కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విషయంలో వచ్చిన ఆరోపణలు ఏపీలో ఏ రాజకీయ పార్టీకి కలసి వస్తాయన్న లెక్కలు వేసుకుటన్నాయి. భారత ఎన్నికల సంఘం లో అంతర్గత విభేదాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మరియు ఫామ్-6 మార్పులపై రేగిన జాతీయ స్థాయి వివాదం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత 10 నెలల్లో సీఈసీ ఒంటెద్దు పోకడలపై 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారనే వార్తలతో ఏపీలోని ప్రధాన పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యూహాలు ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఎవరూ దీనిపై పెద్దగా బయటకు మాట్లాడకపోయినా వచ్చే ఎన్నికల్లో ఎన్నికల సంఘం అంత దూకుడుగా ఏపీలో వ్యవహరించదన్న లెక్కలు వేసుకుంటున్నారు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమకు దీనివల్ల కొంత మేరకు రాజకీయ ప్రయోజనం కలుగుతుందని భావిస్తుంది.సీఈసీపై తలెత్తిన ఆరోపణలతో తాము గత ఎన్నికల ఫలితాలకు కలిపి ముడిపెడుతూ బలం చేకూర్చే పనిలో వైసీపీ ఉంది. ప్రధానంగా సోషల్ మీడియలో గత ఎన్నికల్లో 40 శాతం ఓట్ల షేర్ సాధించిన తమ పార్టీకి కేవలం పదకొండు సీట్లు మాత్రమే రావడం, అర్ధరాత్రి వరకూ జరిగిన ఓటింగ్, చివరి మూడు నాలుగు గంటల్లో ఒక్కసారిగా లక్షల్లో పెరిగిన ఓటింగ్ తమ ఆరోపణలకు ప్రస్తుతం సీఈసీపై తలెత్తిన వివాదం మరింత బలం చేకూరుస్తుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత ఎన్నికల్లో ఓట్ల అక్రమాలు జరిగాయని వైస్సార్సీపీ ఆరోపిస్తూనే ఉంది. ఇప్పుడు ఈసీలోనే అంతర్గత భేదాభిప్రాయాలు, ఓటర్ల జాబితా సవరణలపై అభ్యంతరాలు వెలుగుచూడటంతో తమ ఆరోపణలకు విశ్వసనీయత దొరికినట్లు వైస్సార్సీపీ భావిస్తోంది... అలాగే మరొకవైపు అధికార కూటమి మాత్రం తమ వాదనలను వినిపిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే వివరణ ఇస్తూ.. కమిషనర్ల మధ్య భేదాభిప్రాయాలు అంతర్గత చర్చల్లో భాగమేనని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది. ఏపీలోని అధికార కూటమి సైతం ఇదే లైన్ తీసుకుని, ప్రతిపక్షాలు కేవలం తమ ఓటమిని అంగీకరించలేక రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లుతున్నాయని కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. 2019 నుంచి 2024 నుంచి జగన్ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టడం, కక్ష పూరిత రాజకీయాలు చేయడం, చంద్రబాబు అరెస్ట్ వంటి వాటివల్లనే పదకొండు సీట్లు వచ్చాయని కూటమి నేతలు వాదిస్తున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ ఈ వివాదాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతుగా నిలిచి తమ పొత్తును మరింత బలోపేతం చేసుకోవచ్చు. మొత్తం మీద కేంద్ర ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలు ఎవరికి ప్రయోజనం? ఎవరికి నష్టం? అన్న లెక్కల్లో ఎవరికి వారే ఉండటం విశేషం.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల భద్రాచలంలో ఘనంగా వన మహోత్సవం

గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో సుమారు 300 మొక్కల నాటకం, పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్, గ్రీన్ భద్రాద్రి ప్రతినిధుల హామీవావర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పంతో భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 300 మొక్కలను నాటారు. గ్రీన్ భద్రాద్రి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు.పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమం

లోకల్ బాడీ ఎన్నికలు యధాతథం

విజయవాడ, స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం ఒక క్లారిటీ ఇచ్చింది. ఎన్నికలు ఇంకో రెండు నెలలు ఆలస్యం అవుతాయనే వార్తలను ఖండించింది. పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారమైన మీడియా సమావేశం ద్వారా వెల్లడిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని నమ్మే ముందు.. సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలతో ధ్రువీకరించుకోవాలని సూచించింది. అలాగే స్థానిక ఎన్నికలపై పుకార్లు సృష్టించినా, ఫార్వార్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఏపీ స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మరో రెండు నెలలు ఆలస్యం అవుతుందనే వార్తలను ఖండించింది. ఈ పుకార్లలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల ఆలస్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇందులో ఏ మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. ఈ ఫేక్ వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని తెలిపింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల కోర్టు కేసులపై క్లారిటీ వచ్చాకే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారంలో నిజం లేదని ఏపీ ఎస్ఈసీ వెల్లడించింది. స్థానిక ఎన్నికలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి కల్పిత సమాచారాన్ని ఇతరులకు పంపించ వద్దని ఎన్నికల సంఘం కోరింది.ఏపీ స్థానిక ఎన్నికల సమాచారాన్ని మీడియా సమావేశాల ద్వారా వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. ఎన్నికల కమిషన్ పేరుతో కల్పిత, తప్పుదారి పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని పుట్టించినా, ఫార్వార్డ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసెజ్‌లను నమ్మే ముందు ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక ప్రకటనల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది.ఏపీలో మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తుంది. అయితే ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడ లేదు. కానీ ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో ఈ ఎన్నికల హడావిడి కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సన్నాహాలు చేసుకుంటున్నాయి. కాగా గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపొందింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం సాధించింది. మరి 2026 స్థానిక ఎన్నికల్లో ఎవరిదీ పై చేయిగా ఉండబోతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

పల్లె పండుగ 3.0

నెల్లూరు, వైసీపీ ఐదేళ్ల హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై, కనీస రహదారుల నిర్వహణ లేక రాష్ట్రంలోని పల్లెలు తీవ్ర అంధకారంలోకి వెళ్లిన సమయంలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. నిధుల కేటాయింపులు, పారదర్శక పాలన , స్వర్ణ పంచాయతీ పోర్టల్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ఆగిపోయిన నిధులను పంచాయతీలకు మళ్లించి వ్యవస్థకు కొత్త ఊపిరి పోశారు. ఆయన పట్టుదలతో శాఖలో పనులు వేగవంతమై, గతంలో ఎన్నడూ లేని విధంగా 13,218 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించడం పవన్ కళ్యాణ్ నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలిచింది.పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన అపూర్వమైన చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా గుంతలమయమైన రహదారులకు మహర్దశ పడుతోంది. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, గత పల్లె పండుగ 1.0, 2.0 విడతల్లో వేలాది కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లను, మినీ గోకులాలు , ఇతర మౌలిక వసతులను రికార్డు సమయంలో పూర్తి చేసి పవన్ కళ్యాణ్ తమ శాఖ సామర్థ్యాన్ని నిరూపించారు. గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా, ప్రాధాన్యత క్రమంలో అన్ని ప్రధాన రహదారులను సురక్షితంగా మార్చేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు.ఈ దిశగా పంచాయతీరాజ్ శాఖను మరింత పరుగులు పెట్టిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ. 11,085 కోట్ల భారీ నిధులతో గ్రామీణ రూపురేఖలను మార్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విప్లవానికి తెరలేపారు. గ్రామీణ పేదరికం నిర్మూలనతో పాటు మౌలిక వసతుల కల్పనలో పంచాయతీరాజ్ శాఖ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవడం పవన్ విజన్‌కు అద్దం పడుతోంది.ఈ పల్లె పండుగ 3.0 ద్వారా పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ ఏకంగా 15,500 కిలోమీటర్ల మేర రవాణా సౌకర్యాలను విస్తరించనుంది. ఇందులో రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు, రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. వీటితో పాటు పాడి రైతుల కోసం రూ. 300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, రూ. 225 కోట్లతో ఉద్యాన పంటల పెంపకం, రూ. 110 కోట్లతో మ్యాజిక్ డ్రెయిన్లు , రూ. 200 కోట్లతో పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ, నిరంతర పర్యవేక్షణతో పంచాయతీరాజ్ శాఖ నేడు దేశంలోనే నంబర్ వన్ స్థానానికి దిశగా అడుగులు వేస్తోంది.

గండి మైసమ్మలో అర్ధరాత్రి ఏటీఎం పగలగొట్టి చోరీ

కుత్బుల్లాపూర్, ఏటీఎంను ధ్వంసం చేసి నగదు చోరీకి యత్నించిన వ్యక్తిని దుండిగల్ పోలీసులు అరెస్టు చేశారు. గండిమైసమ్మలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో ఈ నెల 27న తెల్లవారుజామున 1 గంట నుంచి 1.47 గంటల మధ్య చోరీకి ప్రయ త్నించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం ప్రాంగణంలోని పరికరాలు ధ్వంసమైన విషయాన్ని ఉదయం 6.20 గంటలకు గుర్తించిన బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. బ్యాంకు శాఖాధికారి కె. విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన పోలీసులు సూరారం నివాసి, కాకినాడ జిల్లా వాసి ఉండ్రసపు వీరబాబు (26)ను దుండిగల్‌లోని బీఆర్ఎస్ భవన్ సమీపంలో మెద్చల్ రోడ్డుపై అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని ఎనిమిదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.ఏటీఎంల వద్ద భద్రతా సిబ్బంది లేని ప్రాంతాలను గుర్తించి, ముందస్తు ప్రణాళికతో చోరీకి యత్నించేవాడని తెలిపారు. ఈ కేసులో నేరానికి వినియోగించినట్లు పేర్కొన్న సుత్తి, కట్టింగ్ మెషీన్, స్క్రూడ్రైవర్, పదునైన అంచు కలిగిన ఇనుప రాడ్, వైర్ కట్టింగ్ ప్లయర్,మరో స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టీజీ08వీ7402 నంబరు గల మారుతీ సుజుకీ కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.దర్యాప్తు బృందానికి అభినందనలుదుండిగల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్ నాయుడు ఆధ్వర్యంలో కేసును ఛేదించినట్లు

ఈ నలుగురూ వాళ్లే! పహల్గామ్ టెర్రర్ గ్యాంగ్..వేర్వేరు ఆపరేషన్లలో ఖతం



న్యూఢిల్లీ,గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఓ ఫొటో దేశవ్యాప్తంగా వైరల్ అయింది. అడవిలో తుపాకులతో, యుద్ధ దుస్తుల్లో నిల్చున్న నలుగురు లష్కరే తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాదులు.. ఆ చిత్రం కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి ప్రతీకగా మారింది. ఇప్పుడు అదే ఫొటోకు మరో అర్థం వచ్చింది. ఆ చిత్రంలో కనిపించిన నలుగురూ భద్రతా బలగాల వేర్వేరు ఆపరేషన్లలో హతమయ్యారు.ఎల్ఈటీ కీలక కమాండర్ హషీం మూసా అలియాస్ 'ఫౌజీ' మంగళవారం భద్రతా బలగాల కాల్పుల్లో హతమవడంతో ఈ నలుగురి కథకు ముగింపు పడింది.మూసాతో పాటు ఆ ఫొటోలో ఉన్నవారిలో జునైద్ అహ్మద్ భట్, అబు తల్హా, సులేమాన్ షా అలియాస్ ఫైసల్ జాట్ ఉన్నారు. వీరిలో సులేమాన్ ఎల్ఈటీకి చెందిన 'ఏ' కేటగిరీ కమాండర్‌గా గుర్తింపు పొందాడు. జమ్మూకశ్మీర్‌లో గత కొన్నేళ్లుగా జరిగిన పలు ఉగ్రదాడులతో వీరికి సంబంధం ఉన్నట్టు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. 2024 అక్టోబర్‌లో గగాంగీర్ దాడి, 2025 పహల్గామ్ మారణకాండ వంటి ఘటనల్లో వీరి ప్రమేయం ఉన్నట్టు అధికారులు తెలిపారు. 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడి తర్వాత ఈ ఫొటో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. 26/11 ముంబయి ఉగ్రదాడి తర్వాత పౌరులపై జరిగిన అత్యంత ప్రాణాంతక ఉగ్రదాడుల్లో ఒకటిగా పహల్గామ్ ఘటన నిలిచింది. ఈ దాడిలో 25 మంది పర్యాటకులు, ఓ స్థానికుడు ప్రాణాలు కోల్పోయారు.కశ్మీర్ లోయతో పాటు పీర్ పంజాల్ అటవీ ప్రాంతాల్లో చురుగ్గా పనిచేస్తున్న లష్కర్ నెట్‌వర్క్‌కు చెందిన కొందరు ఉగ్రవాదులు తొలిసారి ఒకే ఫొటోలో కనిపించడంతో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం వచ్చింది. తర్వాత దర్యాప్తులో సులేమాన్ షా పహల్గామ్ దాడిలో పాల్గొన్న వారిలో ఒకడిగా గుర్తించారు.ఈ ఫొటో అసలు ఎక్కడ, ఎవరి ద్వారా బయటకు వచ్చిందన్నది స్పష్టంగా తెలియలేదు. అయితే 2024 డిసెంబరులో శ్రీనగర్ సమీపంలోని దచిగామ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన జునైద్ భట్ ఫోన్ నుంచి ఈ ఫొటో లభించినట్టు ఓ నివేదిక పేర్కొంది.

ఒక్కొక్కరుగా ఆపరేషన్లతో అంతం

పహల్గామ్ దాడి తర్వాత కశ్మీర్‌లో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం భారీ స్థాయిలో ఆపరేషన్లు చేపట్టాయి. వైరల్ ఫొటోలో ఉన్న ఒక్కొక్కరు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. చివరగా మిగిలింది హషీం మూసానే.

ఆపరేషన్ దచిగామ్.. జునైద్ భట్ అంతం

కుల్గామ్‌కు చెందిన లష్కర్ కమాండర్ జునైద్ భట్ ఈ ఫొటోలో కనిపించిన వారిలో తొలుత హతమైన వ్యక్తి. 2024 డిసెంబర్ 3న శ్రీనగర్‌లోని దచిగామ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతడు చనిపోయాడు. 2024లో గందర్‌బల్ జిల్లాలోని గగాంగీర్‌లో ఓ టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద జరిగిన దాడిలో ఏడుగురు పౌరులు మృతి చెందిన ఘటనలో భట్ కీలక పాత్ర పోషించినట్టు అధికారులు తెలిపారు. మృతుల్లో ఓ వైద్యుడు, ఆరుగురు కార్మికులు ఉన్నారు.భట్ హతమైనప్పటికీ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగలేదు. ఇతర సభ్యులు పీర్ పంజాల్ అటవీ ప్రాంతాల్లో చురుగ్గా కొనసాగారు.

ఆపరేషన్ మహదేవ్.. సులేమాన్ షా

పహల్గామ్ దాడి తర్వాత భద్రతా బలగాలకు మరో కీలక విజయం లభించింది.పహల్గామ్ దాడికి సులేమాన్, హబీబ్ తాహిర్, హమ్జా అఫ్గానీ పాల్పడ్డారని అధికారులు తెలిపారు. దాడి తర్వాత ఈ ముగ్గురూ దచిగామ్‌లోని దట్టమైన, కొండలతో కూడిన అటవీ ప్రాంతాల్లో దాక్కొని భద్రతా బలగాలకు చిక్కకుండా తప్పించుకున్నారు.పాకిస్థాన్‌కు పారిపోయే మార్గాలను భద్రతా సంస్థలు మూసివేశాయి. అనంతరం 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో బహుళ సంస్థల సంయుక్త ఆపరేషన్ ప్రారంభమైంది.డ్రోన్లు, రిమోట్‌గా నడిచే విమానాలు, ఎలక్ట్రో-ఆప్టికల్ సెన్సర్లు, ఇతర నిఘా పరికరాలను ఉపయోగించి ఉగ్రవాదుల కదలికలను గుర్తించారు. 2025 జూలై 28న దచిగామ్ ప్రాంతంలో వారి జాడను భద్రతా బలగాలు గుర్తించాయి. జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురూ హతమయ్యారు.పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న రెండు ఏకే-47 రైఫిళ్లు, ఓ ఎం-4 కార్బైన్ పహల్గామ్ దాడిలో ఉపయోగించిన ఆయుధాలతో సరిపోలాయి. వారి వద్ద పాకిస్థాన్‌లో తయారైన చాక్లెట్లు కూడా లభించాయి. పూంచ్‌లో 2023 డిసెంబరులో జరిగిన ఆర్మీ కాన్వాయ్‌పై దాడిలో ఐదుగురు సైనికులు మృతి చెందిన ఘటనతో పాటు, 2024 మేలో వైమానిక దళ కాన్వాయ్‌పై దాడి, రియాసీ జిల్లాలో శివఖోరీ నుంచి తిరిగి వస్తున్న యాత్రికుల బస్సుపై కాల్పుల ఘటనలతోనూ ఈ ముగ్గురికి సంబంధం ఉన్నట్టు ఎన్ఐఏ తెలిపింది.

ఆపరేషన్ అష్టర్.. అబు తల్హా హతం

ఫొటోలో ఉన్న మూడో ఉగ్రవాది యాసిర్ అలియాస్ అబు తల్హా పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిగా అతడిని గుర్తించారు. 2025 సెప్టెంబర్ 6న బద్గామ్ జిల్లాలోని యూస్మార్గ్ ఎత్తయిన ప్రాంతాల్లో చేపట్టిన 'ఆపరేషన్ అష్టర్'లో అతడు హతమయ్యాడు. ఎన్‌కౌంటర్ అనంతరం అతడి వద్ద నుంచి ఏకే సిరీస్ తుపాకి, ఇతర యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 2024 గగాంగీర్ దాడితో పాటు, అదే ఏడాది అక్టోబర్ 24న గుల్మార్గ్‌లోని బోటాపత్రి ప్రాంతంలో ఆర్మీ వాహనంపై జరిగిన దాడిలోనూ తల్హా పాత్ర ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆ దాడిలో ఇద్దరు సైనికులతో పాటు మొత్తం నలుగురు మరణించారు. తల్హా గతంలో హషీం మూసా నేతృత్వంలోని లష్కర్ బృందంలో పనిచేశాడని.. అయితే ఏడాది క్రితం ఆ గ్రూపు నుంచి విడిపోయి స్వతంత్రంగా కార్యకలాపాలు సాగించినట్టు సమాచారం.ఇక మిగిలింది ఒక్కరే.. హషీం మూసా.

హషీం మూసా.. 'చివరి వేట'

వైరల్ ఫొటోలో చివరి వరకు మిగిలిన వ్యక్తి హషీం మూసా అలియాస్ ఫౌజీ. ఈ నలుగురిలో అత్యంత కీలక , భద్రతా బలగాలకు అత్యంత కావాల్సిన ఉగ్రవాదిగా అతడిని గుర్తించారు. పాకిస్థాన్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ)లో పారాకమాండోగా పనిచేసిన మూసాకు సైనిక శిక్షణ ఉండటంతో పీర్ పంజాల్ ప్రాంతంలోని క్లిష్టమైన కొండలు, అడవుల్లో సులభంగా కదలగలిగేవాడని అధికారులు పేర్కొన్నారు.

ఏడాదిగా చిక్కలేదు

పహల్గామ్ దాడి దర్యాప్తులో భాగంగా మూసా భద్రతా సంస్థల నిఘా పరిధిలోకి వచ్చాడు. సెప్టెంబర్ 6న యాసిర్ హతమైన తర్వాత కూడా మూసా కోసం కొరాగ్-యూస్మార్గ్ ప్రాంతంలో గాలింపు కొనసాగింది. అతడి కదలికలపై స్పష్టమైన సమాచారం లభించడంతో 'ఆపరేషన్ కొరాగ్' ప్రారంభించారు.

సెప్టెంబర్ 29.. చివరి ఎన్‌కౌంటర్

చివరకు సెప్టెంబర్ 29న భద్రతా బలగాల వేట ముగిసింది. పాల్మెదాన్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హషీం మూసా హతమయ్యాడు.దీంతో పీర్ పంజాల్ ప్రాంతంలో చాలాకాలంగా భద్రతా బలగాలకు సవాలుగా ఉన్న కీలక ఉగ్రవాదుల్లో చివరి వ్యక్తి కూడా అంతమయ్యాడు. ఒకప్పుడు పహల్గామ్ దాడి తర్వాత దేశవ్యాప్తంగా భయాందోళనలకు ప్రతీకగా మారిన ఆ ఫొటోలోని నలుగురూ ఇప్పుడు మిగల్లేదు.ఒకే ఫొటోలో కనిపించిన నలుగురు.. వేర్వేరు ఆపరేషన్లలో ఒక్కొక్కరుగా హతం. పహల్గామ్ దాడి తర్వాత మొదలైన వేట.. చివరకు హషీం మూసా ఎన్‌కౌంటర్‌తో ముగిసింది.

ఇరాన్‌తో చైనా దోస్తీ! 25 ఏళ్ల ఒప్పందం ఓకే



టెహ్రాన్, అమెరికా ఆంక్షలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇరాన్‌కు చైనా అండగా నిలిచింది. రెండు దేశాల మధ్య ఎన్నాళ్లుగానో చర్చల్లో ఉన్న 25 ఏళ్ల వ్యూహాత్మక సహకార ఒప్పందం ఎట్టకేలకు కుదిరింది. టెహ్రాన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇరాన్ విదేశాంగ మంత్రి మహ్మద్ జవాద్ జరీఫ్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఒప్పందంపై సంతకాలు చేశారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2016లో ఇరాన్‌లో పర్యటించినప్పటి నుంచీ ఈ దీర్ఘకాలిక ఒప్పందంపై చర్చలు సాగుతున్నాయి. అప్పట్లోనే ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని వచ్చే దశాబ్దంలో పది రెట్లకు పైగా పెంచి 600 బిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు.

ఇంధనం.. మౌలిక వసతులపై ఫోకస్

ఒప్పందంలోని పూర్తి వివరాలను ఇరాన్, చైనా అధికారికంగా ఇంకా వెల్లడించలేదు. అయితే ఇది విస్తృత స్థాయిలో రూపొందించిన 'వ్యూహాత్మక సహకార ఒప్పందం'గా ఉంటుందని తెలుస్తోంది. ఇరాన్‌లోని కీలక రంగాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంధనం, మౌలిక వసతుల రంగాల్లో సహకారం పెరగడంతోపాటు.. రక్షణ, సైనిక రంగాల్లోనూ ఇరు దేశాల మధ్య సమన్వయం పెరిగే అవకాశమున్నట్లు సమాచారం.ఇరాన్, చైనా రెండూ అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న సమయంలో ఈ ఒప్పందం కుదరడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అణు ఒప్పందం చుట్టూ వివాదం

ఇరాన్-చైనా ఒప్పందం నేపథ్యంలో అమెరికా ఆంక్షలు, ఇరాన్ అణు ఒప్పందం మరోసారి చర్చకు వచ్చాయి. 2015లో ప్రపంచ దేశాలతో ఇరాన్ కుదుర్చుకున్న అణు ఒప్పందం నుంచి అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా వైదొలిగారు. అనంతరం ఇరాన్‌పై తీవ్ర ఆంక్షలు విధించారు.అమెరికా తిరిగి అణు ఒప్పందంలో చేరాలని భావిస్తున్నప్పటికీ.. ఆంక్షలను ఎత్తివేయడానికి ముందు ఇరాన్ తన అణు కార్యకలాపాలపై గతంలో చేసిన కట్టుబాట్లను తిరిగి అమలు చేయాలని అమెరికా స్పష్టం చేసింది.ఇరాన్‌పై ఆంక్షలను ఎత్తివేసి అణు ఒప్పందాన్ని పునరుద్ధరించాలని చైనా, రష్యా ఇప్పటికే అమెరికాను కోరుతున్నాయి. ఇదే సమయంలో అమెరికా హెచ్చరికలను పట్టించుకోకుండా చైనాకు ఇరాన్ చమురు ఎగుమతులు పెరిగినట్లు వ్యాపార వర్గాలు, విశ్లేషకులు చెబుతున్నారు.

అమెరికాకు వ్యతిరేకంగా జత

అమెరికా ఆంక్షల నేపథ్యంలో చైనా తమకు మద్దతుగా నిలవడాన్ని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ప్రశంసించారు. అణు ఒప్పందాన్ని కొనసాగించేందుకు చైనా చూపుతున్న వైఖరికి ధన్యవాదాలు తెలిపారు.అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానానికి వ్యతిరేకంగా చైనా నిలబడుతోందని ఆయన పేర్కొన్నారు. అణు ఒప్పందాన్ని అమలు చేయడంలో ఇరాన్, చైనాల మధ్య సహకారంతోపాటు.. యూరప్ దేశాలు తమ కట్టుబాట్లను నెరవేర్చడం ప్రస్తుత పరిస్థితులను మార్చగలదని రౌహానీ వ్యాఖ్యానించారు.ఆర్థిక, వాణిజ్య రంగాల్లో సహకారంతోపాటు.. ఈ ప్రాంతంలో ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలోనూ ఇరాన్, చైనాలు కలిసి పనిచేయవచ్చని ఆయన తెలిపారు.

'బహుళపక్ష విధానాన్ని కాపాడుతుంది'

అణు ఒప్పందాన్ని కొనసాగించడం ద్వారా అంతర్జాతీయ వ్యవహారాల్లో బహుళపక్ష విధానాన్ని పరిరక్షించవచ్చని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ పేర్కొన్నట్లు ఇరాన్ అధ్యక్షుడి కార్యాలయం వెల్లడించింది.కొత్త అమెరికా ప్రభుత్వం తన విధానాలను పునఃసమీక్షించి.. అణు ఒప్పందంలోకి తిరిగి రావాలని భావిస్తోందని, దీనిని చైనా స్వాగతిస్తోందని వాంగ్ చెప్పినట్లు పేర్కొంది.

ఇరాన్‌లోనూ భిన్నాభిప్రాయాలు

అయితే చైనాతో 25 ఏళ్ల ఒప్పందం కుదుర్చుకోవడంపై ఇరాన్‌లో అందరూ ఏకాభిప్రాయంతో లేరు. ఒప్పందం లక్ష్యాలు, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై దేశంలో చర్చ జరుగుతోంది. అమెరికా, పాశ్చాత్య దేశాలతో సంబంధాలు అంతకంతకూ ప్రతికూలంగా మారుతున్న నేపథ్యంలో తూర్పు దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడం ఇరాన్‌కు ప్రయోజనకరమని ఒప్పందం మద్దతుదారులు వాదిస్తున్నారు. మరోవైపు చైనాతో సంబంధాలు పెంచుకునే క్రమంలో ఇరాన్ తన ప్రయోజనాలను ఎక్కువగా వదులుకోవాల్సి వస్తుందేమోనని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా వేళా సహకారం

ఇరాన్, చైనాల మధ్య సహకారం కొత్తది కాదు. కరోనా మహమ్మారి సమయంలోనూ ఇరు దేశాలు కలిసి పనిచేశాయి. గత నెలలో చైనా తయారు చేసిన సినోఫార్మ్ టీకా 2.5 లక్షల డోసులను చైనా ఇరాన్‌కు అందించింది.ఇరు దేశాల మధ్య అధికారిక దౌత్య సంబంధాలు ఏర్పడి దాదాపు 50 ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో.. టెహ్రాన్‌లోని ఇరాన్ విదేశాంగ శాఖ భవనంలో ఇరు దేశాల దౌత్య సంబంధాలకు సంబంధించిన పత్రాలు, విజయాలను ప్రదర్శించే ప్రత్యేక ప్రదర్శనను కూడా శనివారం ప్రారంభించారు. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ తూర్పు వైపు సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగానే ఈ 25 ఏళ్ల ఒప్పందాన్ని చూడాల్సి ఉంటుందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు పేర్కొంటున్నారు.

విశాఖలో మల్లారెడ్డి వర్సిటీ

విశాఖపట్టణం,తెలంగాణలో బలమైన ఇంజనీరింగ్, మెడికల్ , ప్రైవేట్ విశ్వవిద్యాలయ వ్యవస్థను నిర్మించిన బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి.. ఇప్పుడు తన దృష్టిని ఆంధ్రప్రదేశ్ వైపు సారిస్తున్నారు. తెలంగాణలో మల్లా రెడ్డి యూనివర్సిటీ'తో పాటు డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదాతో విద్యా రంగాన్ని ఏలిన మల్లా రెడ్డి గ్రూప్, ఆంధ్రప్రదేశ్‌లో తన విద్యా వ్యాపారాన్ని అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఏపీలోని ప్రధాన నగరాలు, ఉమ్మడి జిల్లాలను లక్ష్యంగా చేసుకుని రీజినల్ క్యాంపస్‌లు, శాటిలైట్ క్యాంపస్‌లు , ఆఫ్-క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుకు మల్లా రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యం ప్రణాళికలను వేగవంతం చేసింది.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఏపీ ఐటీ, ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో మల్లా రెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఆఫ్-క్యాంపస్ పేరుతో భారీ ఆఫ్-క్యాంపస్ సెంటర్‌ను ఇప్పటికే ప్రారంభించారు. యూజీసీ అనుమతులతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ విభాగాల్లో అత్యాధునిక కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. విశాఖతో పాటు రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ, గుంటూరు బెల్ట్‌తో పాటు రాయలసీమ కేంద్రమైన తిరుపతి, కర్నూలు జిల్లాల్లోనూ కొత్త క్యాంపస్‌ల నిర్మాణానికి భూముల సేకరణ, అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో ఓ కాలేజీని కొని ఇప్పటికే ఆఫ్ క్యాంపస్ ను ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు ఇస్తున్న ప్రోత్సాహకాలు మల్లా రెడ్డి గ్రూప్‌కు కలిసివస్తున్నాయి. తెలంగాణకు చెందిన వేలాది మంది ఏపీ విద్యార్థులు ప్రతిఏటా మల్లా రెడ్డి విద్యాసంస్థల్లో చేరుతున్నందున నేరుగా ఏపీలోని స్థానిక ప్రాంతాల్లోనే నాణ్యమైన మౌలిక వసతులతో క్యాంపస్‌లను అందుబాటులోకి తెస్తే డిమాండ్ మరింత పెరుగుతుందని యాజమాన్యం అంచనా వేస్తోంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఎఐ , డేటా సైన్స్, పారామెడికల్ . లైఫ్ సైన్సెస్ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఏపీ విద్యార్థులను ఆకట్టుకునే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు.మల్లా రెడ్డి విద్యా సంస్థల ఈ అగ్రెసివ్ నెట్‌వర్క్ విస్తరణతో ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ ప్రైవేట్ కాలేజీలు , కార్పొరేట్ విద్యా సంస్థలకు గట్టి పోటీ ఎదురుకాబోతోంది. పొలిటికల్ ఇమేజ్, బ్రాండ్ మార్కెటింగ్, తక్కువ రుసుములతో కూడిన హామీలు, ప్లేస్‌మెంట్స్ నెట్‌వర్క్‌ను చూపించి ఏపీ ఉన్నత విద్యా మ

సిరిసిల్ల - మార్పు కోరుతోంది!



సిరిసిల్ల :బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన అధికారిక అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ బహిరంగ సభ మార్పు సంకేతాలు ఇచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ నిర్వహించే ఏ సభకైనా యంత్రాంగం, నిధుల అండతో జనాన్ని సమీకరించడం సహజమే అయినప్పటికీ.. సిరిసిల్ల సభకు తరలివచ్చిన జనసందోహంలో ఒక ఆర్గానిక్ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపించింది. బలవంతపు తరలింపులకు, స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజా స్పందనకు మధ్య ఉండే విభజన రేఖ ఈ సభలో స్పష్టంగా రుజువైంది. కేటీఆర్‌కు ఎదురేలేదని భావించిన స్వంత గడ్డపైనే ఇంతటి భారీ స్థాయిలో కాంగ్రెస్ బలప్రదర్శన విజయవంతం కావడం గులాబీ శిబిరాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది.

భావోద్వేగాల ఓటింగ్ ఇక ఉండదు!

తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌పై స్థానికంగా యాంటీ-ఇన్‌కంబెన్సీ నెమ్మదిగా బలపడుతోందన్న సంకేతాలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఉద్యమ సెంటిమెంట్ పూర్తిగా కనుమరుగైపోవడంతో.. ప్రజలు ఇకపై కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయి పాలన, నేత అందుబాటులో ఉండే తీరు, చేనేత-రైతు సంక్షేమ హామీల అమలు ఆధారంగానే తమ రాజకీయ తీర్పులను నిర్ణయించే వాస్తవికతలోకి వచ్చారు. గత పదేళ్లలో ఐటీ హబ్‌లు, హైటెక్ మౌలిక వసతుల పేరిట జరిగిన ప్రచారం క్షేత్రస్థాయి సామాన్యుల జీవితాలను ఎంతవరకు మార్చిందనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ బాధితుల సమస్యలు, నేతన్నల ఆత్మహత్యల నివారణలో గత ప్రభుత్వ వైఫల్యాలు ఇప్పటికీ పచ్చిగానే ఉండటం స్థానిక అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది.

లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్ల సెగ్మెంట్‌లో బీజేపీకి మెజార్టీ

ఈ ప్రజా వ్యతిరేకత కేవలం అసెంబ్లీ సభతోనే మొదలుకాలేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు భారీ మెజారిటీ లభించడం కేటీఆర్ రాజకీయ ఆధిపత్యానికి పడిన మొదటి గట్టి ఎదురుదెబ్బ. బండి సంజయ్‌కు 73 వేల ఓట్లు వస్తే , బీఆర్ఎస్ అభ్యర్థికి 65వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. కేటీఆర్ తన సొంత ఇలాకాలోనే ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారన్న నిజం.. ఓటర్ల మైండ్‌సెట్ మారిపోయిందనడానికి తిరుగులేని ఆధారంగా నిలిచింది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఏకపక్ష మద్దతు ఇచ్చిన ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ప్రారంభించగా.. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యంలోకి కాంగ్రెస్ వేగంగా చొచ్చుకువెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

మరింతగా దృష్టి పెట్టనున్న రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తుగడలు సిరిసిల్ల రాజకీయాలను మునుపటి కేటీఆర్ వర్సెస్ ఇతరులు స్థాయి నుంచి మార్చి, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ ప్రధాన పోరుగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల ఫలితాలతో రెండో స్థానానికి వెళ్లిన బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంక్షేమ పథకాలను రేవంత్ సిరిసిల్లాపై కేంద్రీకరిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, స్థానిక వర్గాలకు భరోసా ఇస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలమైన సంస్థాగత పునాదులను ఏర్పాటు చేస్తోంది. ఈ సభ ద్వారా రేవంత్ రెడ్డి వేసిన తొలి అడుగు భవిష్యత్తులో మరింత దూకుడుగా మారనుందని, కేటీఆర్‌ను ఆయన సొంత గడ్డపైనే రాజకీయంగా కట్టడి చేసేందుకు కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళ్తోందని స్పష్టమవుతోంది.

గాంధీ జయంతి నుంచి వారం పాటు ఉద్యమం



న్యూఢిల్లీ, అక్టోబరు 1,కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం వ్యవహారశైలికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు విపక్ష కూటమి ఐక్య కార్యాచరణను ప్రకటించింది. ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా కూటమి అగ్రనేతలు నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భవిష్యత్ ఉద్యమ ప్రణాళికను వెల్లడించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి అక్టోబర్ 8 వరకు దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు సేవ్ డెమోక్రసీ పేరిట నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరితో కలిసి ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి భారీ నిరసన ర్యాలీ చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం అక్టోబర్ రెండో వారంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అపాయింట్‌మెంట్ కోరి, రాజ్యాంగబద్ధ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా తన గుప్పిట్లోకి తీసుకుంటోందో వివరిస్తూ వినతిపత్రం అందజేయనున్నట్లు ఖర్గే వెల్లడించారు.ఎన్నికల వ్యవస్థలో జరుగుతోన్న ఓటు చోరీ వ్యవహారంపై సుప్రీంకోర్టులోని కేసులను వేగవంతం చేయాలని కోరడంతో పాటు, అక్టోబర్, నవంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా 5 భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధినేత తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికల కమిషన్‌లోని కొందరు అధికారులను కీలుబొమ్మలుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారిని తప్పకుండా శిక్షించేలా చూస్తామని రాహుల్ గాంధీ స్పష్టం చేస్తూ.. దేశంలో ఎన్నికలను కొల్లగొడుతున్నారనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రతిపక్షం విజయవంతమైందని, ముఖ్యంగా యువతలో ఈ అన్యాయాన్ని ఎదిరించే చైతన్యం పెరిగిందని పేర్కొన్నారు.మరోవైపు జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెచ్చరించారు. ఎన్నికల సంఘం పరిధిలో ఎస్ఐఆర్ అమలు, ఫామ్-6 మార్పులు, ఓటర్ల జాబితాల తొలగింపు, సాఫ్ట్‌వేర్ కేంద్రీకరణ వంటి కీలక నిర్ణయాలపై విచారణ చేయాలనిఅంటున్నారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత కోల్పోయిందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం క్షేత్రస్థాయి నుంచి న్యాయస్థానాల వరకు రాజీలేని పోరాటం సాగిస్తామని ఇండీ కూటమి ప్రకటించింది.

మేఘనకు అన్యాయం చేసి.. వెంటాడుతున్న జోగి ఫ్యామిలీ !

అమరావతి,వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ ప్రస్తుతం తన సొంత కుటుంబంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించుకోలేకపోతున్నారు. సమాజంలో ఎంతో మంది సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పుకునే ఆయన, తన కోడలు జోగి మేఘనకు న్యాయం చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. పెళ్లి పేరుతో ఒక యువతి జీవితాన్ని నాశనం చేయడమే కాకుండా, బాధితురాలికి బాధ్యతాయుతంగా అండగా నిలవాల్సిన స్థానంలో ఉన్న మాజీ మంత్రి కుటుంబమే ఆమెను వేధింపులకు గురిచేస్తోంది.తనకు మ, తన కుటుంబానికి జోగి రమేష్ నుంచి ప్రాణహాని ఉందంటూ మేఘన బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కోసం ఆమె ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలవడంతో పాటు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను ఆశ్రయించి తనకు రక్షణ కల్పించాలని వేడుకునే పరిస్థితి వచ్చింది. ఒక మాజీ మంత్రి కుటుంబంపై ఒక మహిళ ఈ స్థాయిలో ప్రాణభయంతో రాజ్యాంగబద్ధ వ్యవస్థలను ఆశ్రయించాల్సి రావడం, వివాదాన్ని ఎంత దారుణమైన స్థాయికి తీసుకెళ్లారో తెలియజేస్తోంది.సొంత కోడలు అడుగుతున్న న్యాయబద్ధమైన కోరికలను నెరవేర్చి, పెద్దమనసుతో వివాదాన్ని ముగించాల్సింది పోయి.. బెదిరింపులకు పాల్పడుతున్నారనే వార్తలు ఆ కుటుంబ వైఖరిని ఎత్తిచూపుతున్నాయి. పొలిటికల్ ఇమేజ్, హోదా కంటే కుటుంబ గౌరవం, ఒక మహిళ జీవితం ముఖ్యమని గ్రహించలేకపోవడం జోగి రమేష్ రాజకీయ పరిణితిలోని లోపాన్ని స్పష్టం చేస్తోంది.గొడవను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి అవకాశాలు ఉన్నప్పటికీ, పంతాలకు పోయి ఆ ఆమోదయోగ్యమైన మార్గాన్ని మూసివేయడం ఆయన ప్రవర్తనపై అనేక అనుమానాలకు తావిస్తోంది.జోగి మేఘనకు జరిగిన మానసిక, శారీరక అన్యాయాన్ని కాలం వెనక్కి తిప్పి పూర్తిగా సరిదిద్దలేరు. కానీ ఇప్పటికైనా ఒక ప్రజాప్రతినిధిగా, కుటుంబ పెద్దగా విజ్ఞతతో వ్యవహరించి ఆమెకు దక్కాల్సిన న్యాయాన్ని అందించకపోతే... అది కేవలం ఆయన



బాధ్యతారాహిత్యమే కాకుండా, రాజకీయ అహంకారానికి నిదర్శనంగా మిగిలిపోతుంది. సొంత ఇంట్లోనే ఒక మహిళకు రక్షణ, నిష్పాక్షికమైన న్యాయం అందించలేని నేతలు, సమాజానికి ఏం న్యాయం చేస్తారంటూ వస్తున్న విమర్శలకు జోగి రమేష్ సమాధానం చెప్పుకోవాల్సిందే!

ఉల్లితో పాటు త్వరలోనే కందిపప్పు, పామాయిల్ రాయితీపై పంపిణీ

అమరావతి,విజయవాడలో కిలో ఉల్లిని రూ.35లకే అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ధరల వ్యత్యాసాన్ని గమనిస్తున్నాం. సామాన్యుడికి సాంత్వన కలిగేలా రాయితీపై నిత్యావసరాలు అందిస్తున్నాం. దేశంలో ఆహార ధాన్యాల కొరత లేదు. రాష్ట్రంలో ఉల్లితో పాటు త్వరలోనే కందిపప్పు, పామాయిల్ రాయితీపై పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

అమెరికాకు నో చెబుతున్న న్యూ ట్రెండ్



హైదరాబాద్, ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో .. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.అమెరికాలో ఓ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది.ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్న్‌షిప్ ప్రివరేషన్‌పై దృష్టి పెడుతున్నారు.క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు.విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి.ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది.క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి.దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది.ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు.ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు.అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది.మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి.

బీజేపీకి ఇచ్చినవి దక్కించుకోవడమేనా ?

అమరావతి,ఏపీ బీజేపీ కూటమిలో భాగస్వామ్యంగా ఉంది కానీ వాయిస్ మాత్రం సన్నగానే వినిపిస్తోంది. కూటమిలో రెండవ స్థానంలో కీలకంగా జనసేన ఉంది. ఆ పార్టీకి 21 మంది ఎమ్మెల్యేలు ముగ్గురు మంత్రులు ఉన్నారు. ఇక జనసేనకు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కింది. పవన్ వంటి ఇమేజ్ ఉన్న నాయకుడు ఆ పార్టీకి అతి పెద్ద అండగా ఉన్నారు. పైగా జనసేనకు ఏపీలో ఓటు షేర్ ఎక్కువ. ఒక బలమైన సామాజిక వర్గం ఆ పార్టీ వెంట ఉంది. దీంతో పాటు ఎప్పటికైనా రాజ్యాధికారం అందుకోవాలన్న ఆకాంక్ష జనసేనకు ఉంది. అందుకే ఆ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను ఒక మంచి అవకాశంగా చూస్తోంది. దాంతో ఎక్కువ సీట్లు తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తోంది. ముప్పయి శాతం సీట్లు తమకు ఇవ్వాలని జనసేన గట్టిగా అనగలుస్తోంది. అదే పెద్ద గొంతును మరో మిత్ర పక్షం అయిన బీజేపీ వినిపించ లేకపోతోంది అని అంటున్నారు.

భారం అంతా వారిదే :

ఇక ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలను బీజేపీ జాతీయ నాయకత్వం అంత సీరియస్ గా తీసుకోవడం లేదని అంటున్నారు. బీజేపీకి ఎంపీలు ముఖ్యం. అలాగే తమకు ఏపీలో బలం పెరగాలి అంటే ఎమ్మెల్యేలు కూడా ముఖ్యం. దాంతో సార్వత్రిక ఎన్నికల్లో అయితే నేరుగా జాతీయ నాయకత్వం ముందుకు వచ్చి చర్చలు జరుపుతుంది. కానీ లోకల్ బాడీస్ ఎన్నికలు కాబట్టి ఏపీ నాయకత్వం మీదనే బాధ్యతలను భారాన్ని మోపింది అని అంటున్నారు. గత నెలలో విశాఖ వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అయితే స్థానికంగా కూడా బీజేపీ బలపడాలని దిశా నిర్దేశం చేసి వెళ్లారు. అందువల్ల వీలైనంత ఎక్కువగా సీట్లు తీసుకఒవాలని సూచించారు. దాంతో ఏపీ నాయకత్వమే ఈ విషయంలో కూటమిలో తేల్చుకోవాల్సి ఉందని అంటున్నారు.

ఎన్ని సీట్లు ఇస్తారంటే :

ఇదిలా ఉంటే ఏపీలో మిత్రులకు ఇరవై శాతం సీట్లు ఇచ్చి ఎనభై శాతం సీట్లలో పోటీ చేయాలని టీడీపీ పెద్దలు అనుకుంటున్నారు అని ఆ మధ్యన ప్రచారం అయితే సాగింది. ఇందులో నిజమెంత ఉందో తెలియదు కానీ పదిహేను శాతం సీట్లు జనసేనకు అయిదు శాతం సీట్లు బీజేపీకి ఇస్తారు అన్నది అయితే వైరల్ న్యూస్ అయింది. దీని మీద జనసేన తన గొంతు పెంచింది. అలా



కుదరదు ముప్పయి శాతం సీట్లు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేస్తూ వస్తోంది. దాంతో జనసేనకు ఎన్ని ఇస్తారు అన్నది పక్కన పెడితే ఎక్కువే దక్కుతాయని అంటున్నారు. అదే సమయంలో అయిదు శాతం బీజేపీకి అన్న దాని మీద ఏపీ కమలనాధులు అయితే ఇప్పటిదాకా నోరు విప్పలేదని గుర్తు చేస్తున్నారు.

సర్దుకుపోవడమేనా :

ఏపీ బీజేపీకి క్షేత్ర స్థాయిలో పెద్దగా బలం లేదన్నది తెలిసిందే. కూటమి పొత్తులతోనే సీట్లు గెలవాల్సి ఉంటుంది. ఒక వేళ ఎక్కువ సీట్లు ఇచ్చినా అక్కడ ఓటు బదిలీ అన్నది ఇతర పార్టీల నుంచి జరగకపోయినా బీజేపీ గట్టిగా నిలబడకపోయినా వైసీపీకి చాన్స్ దక్కుతుంది. దాంతో బీజేపీ విషయంలో బలమెంత ఎక్కడ ఏమిటి అన్నది కూటమి పెద్దల వద్ద కచ్చితమైన సమాచారం ఉందని అంటున్నారు. దాంతో బీజేపీకి ఇవ్వాల్సిన సీట్లు ఇస్తారని అంటున్నారు. అలా మిత్ర ధర్మం ప్రకారం దక్కే సీట్లలో సర్దుకుని పోటీ చేయడమే కమలం పార్టీ కర్తవ్యం అని అంటున్నారు. ఇక బీజేపీకి చెందిన ఏపీ నాయకత్వం కూడా పెద్దగా పట్టుబట్టే అవకాశాలు ఈ విషయంలో లేవనే అంటున్నారు. మొత్తానికి చూస్తే ఏపీ బీజేపీ పరిస్థితి ఇచ్చునమ్మ వాయినం పుచ్చుకున్న వాయనం అన్నట్లుగానే ఉండబోతోంది అంటున్నారు. విశాఖ మేయర్ వంటి వాటిని కోరుతున్నట్లుగా వార్తలు వస్తున్నా అంతిమంగా ఎక్కడ ఏమి ఇస్తారు అన్నది కూటమి పెద్దల ఇష్టమే అని అంటున్నారు.

శభాష్ మచార్...పైలెట్ కు మోడీ ప్రశంసలు



న్యూఢిల్లీ, అక్టోబరు 1,దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగానే కో-పైలట్ చేతిలో కత్తిపోటుకు గురైన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచార్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ పరిస్థితిని అదుపులో ఉంచుతూ విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడేందుకు కీలకంగా వ్యవహరించారుఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. గురువారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పంచుకున్న ప్రధాని.. కెప్టెన్ స్మిత్ మచార్‌ను హీరోగా అభివర్ణించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో తీవ్రంగా గాయపడినా, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచలమైన సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం వందలాది ప్రాణాలను కాపాడి, పెద్ద విషాదాన్ని నివారించిందని అన్నారు. కెప్టెన్ మచార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కూడా కెప్టెన్ మచార్ సాహసాన్ని ప్రశంసించారు. కత్తిపోటుకు గురై తీవ్రంగా గాయపడినప్పటికీ దాడి చేసిన వ్యక్తిని ప్రతిఘటించి, కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు సహకరించారని తెలిపారు. అనంతరం ప్రయాణికులు, సిబ్బంది కలిసి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో గగనతలంలో పెను ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటనలో 174 మంది ప్రాణాలను కాపాడిన కెప్టెన్ మచార్ నిజమైన హీరో అని కొనియాడారు

అసలేం జరిగిందంటే

మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర కలకలం రేపిన ఒక ప్రధాన వైమానిక భద్రతా ఘటనలో 174 మంది ప్రయాణికుల ప్రాణాలు దక్కాయి. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానం 1073 పై జరిగిన దాడి, దానికి ఒక భారతీయ పైలట్ ఎదురొడ్డి నిలిచిన తీరు అంతర్జాతీయ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విమానం గాల్లో ఉండగా కోపైలట్ దాడికి పాల్పడగా, తీవ్ర గాయాలైనప్పటికీ పైలట్ చూపిన తెగింపు వల్లే విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.అంతర్జాతీయ మీడియా , ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. విమానంలోని కాక్‌పిట్‌లో ఉన్న భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చార్ పై ఒక దుండగుడు అకస్మాత్తుగా చాకుతో దాడి చేశాడు. కెప్టెన్ స్మిత్‌ను తీవ్రంగా పొడవడంతో ఆయన రక్తసిక్తమయ్యారు. అయితే, ఎంతో సమయస్ఫూర్తి, ప్రాణాల కంటే ప్రయాణికుల భద్రతే ముఖ్యం అనుకున్న ఆయన తీవ్ర గాయాలతోనే కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. కాక్‌పిట్ డోర్ తెరుచుకోవడంతో వెంటనే అప్రమత్తమైన ఇజ్రాయెల్ ప్రయాణికులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కి చెందిన విమాన సిబ్బంది కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లారు. తీవ్రమైన ఘర్షణ అనంతరం ఆ దుండగుడిని లొంగదీసుకుని, హ్యాండ్‌కఫ్ చేసి బంధించారు. విమానాన్ని సురక్షితంగా సమీప విమానాశ్రయంలో ల్యాండింగ్ చేయడంతో ప్రయాణికులు, సిబ్బంది అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌ను రియల్ హీరోగా కొనియాడింది. భారతీయుడు, ఇజ్రాయెలీ, ఎమిరాటీ.. ఇలా వేర్వేరు దేశాలకు చెందిన వ్యక్తులు ఐక్యంగా నిలబడి ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు 174 మంది ప్రాణాలను కాపాడాయి. తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం అని ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ విమానయాన భద్రతా సంస్థలు మరియు వివిధ దేశాల ప్రభుత్వాలు ఆయన చూపిన ధైర్యసాహసాలను, సమయస్ఫూర్తిని ప్రశంసిస్తున్నాయి. వివిధ దేశాల మధ్య ఉన్న సహకారం, విమాన సిబ్బంది సమర్థతకు ఈ ఘటన ఒక నిదర్శనంగా నిలిచింది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140